పేదింట ఉడకని..కందిపప్పు

- రేషన్ దుకాణాల్లో కానరాని వైనం
- బహిరంగ మార్కెట్లో అధిక ధర
- పేద, మధ్య తరగతి ప్రజలు సతమతం





గతంలో రేషన్ డిపోల ద్వారా పంపిణీ అయిన కందిపప్పు ప్యాకెట్లు (ఫైల్)

అల్లిపురం: కందిపప్పు ధర ఆకాశాన్నంటినా వారంలో రెండు మూడు రోజులకు ఒకసారైనా కందిపప్పు వండాల్సిందే. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లాలోని రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందని ద్రాక్షగానే మిగిలింది. పేదింట పప్పు ఉడకడం లేదు. తక్కువ ధరకే చౌక ధరల దుకాణాల్లో అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు మార్కెట్లో కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీస్తున్నా అదుపు చేసే వ్యవస్థ లేకపోవడంతో కలవరపడుతున్నారు. పేదలకు చౌక దుకాణాల్లో కంది పప్పు కరువైంది. బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. అలాంటి నిత్యావసర సరుకును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ప్రతి నెలా రేషన్ ద్వారా సరఫరా చేసేది. ఇప్పుడు అడిగిన ప్రతి సారి వచ్చే నెల వస్తుందని డీలర్లు చెప్పడం తప్ప వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అసలు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని పరిస్థితి. ప్రస్తుతం పేద, మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డుకి కిలో కందిపప్పు అందించాలని కోరుతున్నారు. కందిపప్పు సరఫరాపై కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం ఒకటి ఇస్తే ఏం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. కుటుంబానికి సరిపడా కంది పప్పు, మంచి నూనె తదితర నిత్యావసర సరుకులు కూడా అందించాలని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య తరగతి ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, మంచినూనె సరఫరా చేయాలని కోరుతున్నారు.

కందిపప్పు సరఫరా చేయాలి..



రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. నిత్యావసర సరుకులైన కందిపప్పు, వంట నూనెతో ఇతర సరుకులను రేషన్ కార్డుదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.

– దుంప రజని, కుమ్మరివీధి

కందిపప్పు లేదంటున్నారు..



రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో రేషన్ షాపుల్లో రూ.67కే కందిపప్పు ఇచ్చేవారు. దీని వల్ల కుటుంబానికి కొంత ఆసరాగా ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి పేద కుటుంబాలను ఆదుకోవాలి. బయట మార్కెట్లో కందిపప్పు కొనలేకపోతున్నాం.

– తిరుపతి రమణి, అల్లిపురం

బయట కొనలేకపోతున్నాం..



గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి కార్డుదారుడికి కందిపప్పు అందించాలి. పట్టణ ప్రాంతాల్లో చాలా వరకు పేద, మధ్య తరగతి వారే ఉన్నారు. బయట మార్కెట్‌లో కందిపప్పు అధిక ధరకు అమ్ముతున్నారు. పేద, మధ్య తరగతి వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కందిపప్పు అందించాలి.

– గంగుల మానస, వెంకటేశ్వరమెట్ట

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



సింగ్‌హోటల్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న సిటు నాయకులు, కార్మికులు

డాబాగార్డెన్స్: చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని, కేంద్రంలోని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు శత శాతం సమర్థిస్తూ రాష్ట్రంలోని కార్మిక వర్గానికి కూటమి ప్రభుత్వం తీవ్ర దోహం చేస్తుందని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆరోపించారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ జంక్షన్ నుంచి సింగ్ హోటల్ జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి, కార్మికులను బానిసలుగా చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో కార్మికులు రోజుకు 8 గంటల పని చేసే నిబంధనను మార్పు చేసి, 13 గంటలు పని చేయాలని బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఈ బిల్లును తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం శత శాతం అమలు చేయాలని పూనుకుందన్నారు. ఈ బిల్లు గనక అమలు జరిగితే కార్మికులు తిరిగి బానిసలుగా మారే పరిస్థితికి నెట్టబడతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విశాఖ విచ్చేస్తున్న నేపథ్యంలో ఈ బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజయ్‌శర్మ, జగ్గునాయుడు, బి.జగన్, పి.మణి, ఎం.సుబ్బారావు, పీవీఎస్‌బీ శ్రీనివాసరాజు, చంద్రశేఖర్, జ్యోతీశ్వరరావు, కుమార మంగళం, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

అక్కినేనికి స్వర నివాళి



అక్కినేని చిత్రగీతాలతో స్వర నివాళి అర్పిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్: నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని ఆల్ ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ ప్రేమసమాజం ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన అక్కినేని సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. భూషణ్ బ్రదర్స్ సారథ్యంలో ఫణిభూషణ్, శశిరాణి పాడిన వెన్నెల్లోనే వేడి ఏలనే, బొట్టా నాగేశ్వరరావు, యమున పాడిన నీ కోసం వెలిసింది, శశిభూషణ్, గిరిజ పాడిన ఒక దేవుని గుడిలో, సుబ్రహ్మణ్యం పాడిన మనసున మనసై, దేవి మధుప్రియ, శశి పాడిన మల్లెపూలు ఫెల్లుమన్నవి వంటి ప్రజాదరణ పొందిన చిత్ర గీతాలతో అక్కినేనికి స్వర నివాళి అర్పించారు. ముందుగా గాయనీ గాయకుల సంఘం అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఫణిస్వామి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కీబోర్డ్‌పై సోమేశ్, తబలాపై బీవీ రమణమూర్తి, అప్పలరాజు, ప్యాడ్స్‌పై బాబ్జి చక్కటి వాద్య సహకారమందించారు.

క్లుప్తంగా

వార్డు సమస్యలపై ఆరా



వార్డు సమస్యలపై ఆరా తీస్తున్న పీతల వాసు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డులో సమస్యలు ముప్పిరిగొన్నాయి. అయితే వాటికి పరిష్కారం చూపాల్సిన కార్పొరేటర్ పట్టించుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆదివారం ఉదయం వార్డు పరిధి ఊటగెడ్డతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఊటగెడ్డలో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడతున్న దృష్ట్యా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు బెవర మహేష్, కొండ్రు సతీష్, అలపన వెంకటరెడ్డి, కోండ్ర అప్పారావు, కొల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి దహన సంస్కారాలు చేస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో రెస్క్యూ చేసిన గుర్తు తెలియని వ్యక్తిని అనారోగ్యం కారణంగా ఈ నెల 19న అత్యవసరంగా కేజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి ఆదివారం తుది శ్వాస విడిచారు. దీంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు మృతదేహానికి జ్ఞానాపురం స్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. రాచకొండ చారిటీస్ అధినేత రాచకొండ దశరథ రామయ్య దహన సంస్కారాలకైన ఖర్చు అందజేశారని కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

డాక్టర్ సక్సేనా సేవలు ప్రశంసనీయం



డాక్టర్ సక్సేనా జయంతి సభలో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్ర నాథ్

మహారాణిపేట: వైద్య రంగానికి డాక్టర్ సక్సేనా అందించిన సేవలు మరువలేనివని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఆంధ్రా యూనివర్సిటీ ఎస్ఎస్ఎస్ భవన్‌లో జరిగిన పద్మశ్రీ డాక్టర్ కె.జి.సక్సేనా జయంతి సందర్భంగా హోమియోపతీ వికాస్ దివస్ పేరిట జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సక్సేనా చిత్ర పటానికి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సతీష్ కేక్ కట్ చేశారు. డాక్టర్ బి.వెంకటేశ్వరరావు డాక్టర్ సక్సేనా జీవిత విశేషాలు తెలిపారు. ప్రారంభ సభను విశాఖ అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్రరావు నిర్వహించారు. నిరంతర వైద్య విద్యా కన్వీనర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ప్రొఫెసర్ డాక్టర్ సనపల ఆనందరావు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ వాకా సునీత పలు అంశాలపై ప్రసంగించారు. వైద్యుల సంస్థ లైఫ్ మెంబర్‌షిప్ సర్టిఫికెట్లను డాక్టర్ శివకాంతి పంపిణీ చేశారు. కార్యదర్శి డాక్టర్ రాజా శ్రీకాంత్ వందన సమర్పణ చేశారు.

నేటి నుంచి యువజనోత్సవాలు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23న 11 అంశాల్లో యువజనోత్సవాలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారు. 22న వక్తృత్వ, వ్యాసరచన, వాద – ప్రతివాద, క్విజ్, రంగవల్లులు, చిత్రలేఖనం, నాటికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. అదే విధంగా 23న సోలో సాంగ్, గ్రూప్ సాంగ్, శాస్త్రీయ నృత్యం, జానపద బృంద నాట్యాల్లో పోటీలు నిర్వహిస్తారు. పోటీలకు ఏయూ అనుబంధ కళాశాలల జాతీయ సేవా పథక కార్యకర్తలందరూ అర్హులే. విజేతలకు జాతీయ సేవా పథక దినోత్సవమైన సెప్టెంబర్ 24న బహుమతులు అందజేస్తారు.

ఒకరి రక్తదానంతో పలువురికి ప్రాణదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మహారాణిపేట: ఒకరి రక్తదానం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. ప్రధాని మోదీ 76వ జన్మదినోత్సవం సందర్భంగా పార్టీ వైద్య విభాగం, ట్రిబుల్ వన్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, భారతీయ జనతా పార్టీ పద్మనాభం మండలం సంయుక్త నిర్వహణలో రామ్‌నగర్‌లోని ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకులో జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా రక్తదాతలను అభినందించారు. రక్తదానం వల్ల 120 రోజుల్లో శరీరంలో కొత్త రక్తకణాలు ఉద్భవించి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిబుల్ వన్ స్వచ్ఛంద సంస్థ అధినేత హర్షవర్ధన్ సాయి, బీజేపీ పద్మనాభం మండల ఉపాధ్యక్షుడు మచ్చ సోమేష్, గడిదేసి కిరణ్ కుమార్, నమ్మి రవి, ముద్దాడ సాయిబాబు, నమ్మి సురేష్, మనోజ్, శ్రీకాంత్, రిత్విక్, హర్షవర్ధన్, సంతోష్ కుమార్ సాదు, సాయి సంతోష్, హేమంత్ రుతిక్, బాలాజీ, శ్రావణ్, భార్గవ్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌కు చెందిన సునీత, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన యూత్ వింగ్ ఆధ్వర్యంలో..

ఆదివారం మహారాణిపేటలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో ఏయూ జనసేన యూత్ వింగ్ సభ్యులు పైడికొండ సునీల్ నాయుడు, సేనాపతి వెంకటేశ్వరరావు, గురుస్వామి, ప్రదీప్, జస్వంత్, శ్రవణ్ కుమార్, దీపక్ తదితరులు రక్తదానం చేశారు. వీరిని రెడ్ క్రాస్ చైర్మన్ సీహెచ్ బాలసతీష్, కొయిలాడ శ్రీనివాసరావు అభినందించారు.

రాముకు అభినందనలు



వాసుపల్లికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పచ్చిరపల్లి రామారావు (రాము) పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వాలంటరీ వింగ్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్, కృష్ణారెడ్డి, బడుగు శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, కనిగిరి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

గురజాడ జీవితాన్ని పాఠ్యాంశంగా ఇవ్వాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

డాబాగార్డెన్స్: మహాకవి గురజాడ అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా ఇవ్వాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ శాసన మండలి సభ్యుడు ఎంవీఎస్ శర్మ డిమాండ్ చేశారు. గురజాడ జయంతిని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకా బస్టేషన్ వద్ద గల గురజాడ విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శర్మ మాట్లాడుతూ జాతీయోద్యమంలో దేశానికి వెన్నుపోటు పొడిచిన సావర్కర్ వంటి వారి జీవితాలను పాఠ్యాంశాలుగా మార్చుతున్న కేంద్ర ప్రభుత్వం, సామాజిక రుగ్మతలపై తన సాహిత్యంతో పోరాటం చేసిన గురజాడను విస్మరించడం దేశ ద్రోహంతో సమానమన్నారు. ప్రజా నాట్యమండలి నాయకులు చంటి, రమణ గురజాడ రచించిన 'దేశమును ప్రేమించుమన్నా'గేయం ఆలపించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వైఎ.ఆర్‌కే ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు, టి.అప్పారావు, ఎం.రామకృష్ణ, శేషగిరి, ఎ.చంద్రశేఖర్, పీవీ రమణ, ఎ.సుధాకర్, బీఎల్ నారాయణ, గంట్యాడ శ్యామల, గురజాడ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్ సూపర్‌మార్కెట్‌లో చోరీ



దుకాణంలో తచ్చాడుతున్న నిందితుడి సీసీ ఫుటేజీ

అల్లిపురం: కొబ్బరి తోటలోని వీబీఆర్ ఆయిల్ అండ్ జనరల్ హోల్‌సేల్ కిరాణా దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. టూటౌన్ క్రైం ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం పై కప్పు నుంచి షాపులోకి చొరబడి రూ. లక్ష 30 వేల నగదు అపహరించినట్లు తెలిపారు. ఈ షాపు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే షాప్ ఇన్‌చార్జ్ కుమారి షాపు తెరిచి చూస్తే దొంగతనం జరిగినట్టు గుర్తించారు. విషయం షాపు యజమానికి తెలియజేయటంతో ఆయన టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. విల్లూరి భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

యుద్ధాల నివారణతోనే ప్రపంచ శాంతి



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సీతంపేట: ఐఏఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. సంస్థ చైర్మన్ సరవ ప్రకాశరావు అధ్యక్షతన ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి, గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కె.రవి మాట్లాడుతూ రోజురోజుకూ ఉగ్రవాదంతోపాటు దేశాల ఆయుధ శక్తి కూడా పెరుగుతోందని, దీంతో దేశాలకు ఒకరిపై మరొకరికి నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. దీని ప్రభావం దేశ అభివృద్ధిపై పడుతోందని, మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఐక్య రాజ్య సమితి చురుకైన పాత్ర పోషించాలన్నారు. అనంతరం సభ్యులంతా శాంతి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, ప్రజ్ఞాన్ కుమార్, కె.వి.ఎస్.మూర్తి, చాట్ల బాబూరావు, రాజ్‌ధామ్ భిక్షు, బంగార్రాజు పాల్గొన్నారు.

అల్జీమర్స్‌తో అప్రమత్తం



డాక్టర్ వాణిని సత్కరిస్తున్న న్యూరాలజీ విభాగం వైద్యులు

మహారాణిపేట: మతి మరుపు (అల్జీమర్స్)తో జాగ్రత్తగా ఉండాలని, తాజాగా మధ్య వయసు వారిలో కూడా మతి మరుపు వస్తుందని కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి అన్నారు. ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఈ క్లాస్ రూమ్‌లో జరిగిన ప్రపంచ మతిమరుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సీఎంఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి అల్జీమర్స్‌పై అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ నిపుణులు డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.కిషోర్ బాబు, డాక్టర్ కె.సత్యారావు, డాక్టర్ ఎం.మధుసూదన బాబు, డాక్టర్ ఎస్.వి.సుందరాచార్య, డాక్టర్ టి.సతీష్ కుమార్, డాక్టర్ సీహెచ్ సుష్మ, కె.మనోజ్ కుమార్, డాక్టర్ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా...



ఆదివారం సాయంత్రం కారుమబ్బులతో కురిసిన వర్షానికి ఆహ్లాదంగా కనిపిస్తున్న ఫ్లైఓవర్

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రమాదకరంగా కల్వర్టు

- గాయాలపాలవుతున్న వాహన చోదకులు, పాదచారులు



ప్రమాదకరంగా మారిన కల్వర్టు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట గుడి నుంచి మూడు గుళ్లకు వెళ్లే దారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రెండు నెలల క్రితం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పని నిమిత్తం కల్వర్టుపై పలకను తొలగించారు. పని పూర్తయినా కల్వర్టుపై పలకను ఏర్పాటు చేయక పోవటంతో వాహన చోదకులు, పాదచారులు గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాపోతున్నారు. దీంతో స్థానికులు అడ్డంగా సిమెంట్ ఇటుకను ప్రమాద సూచికగా పెట్టారు. ఇప్పటి వరకు పది మంది వరకు ఈ డ్రైన్‌లో పడి దెబ్బలు తగిలించుకున్నారని తెలిపారు. శ శనివారం రాత్రి ఇద్దరు వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యారన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కల్వర్టుపై పలక ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతుబజార్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రైతు బజార్‌లో మార్కెటింగ్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు తదితరులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను ఆదివారం జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అపర్ణప్రసాద్, వైస్ చైర్మన్ వింకు మహంతి చంద్రశేఖర్, డైరెక్టర్లు తాతారావు, శోభ సందర్శించారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లోని స్టాళ్ల వద్దకు వెళ్లి రైతుల సమస్యలు, సౌకర్యాల కల్పనను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు విలువైన సేవలు అందించాలని సూచించారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని అరికట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతుబజార్ల పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ విషయంలో రైతులు, వినియోగదారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

కాలబైరవ స్వామికి పూజలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలోని కాల భైరవ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కాలభైరవ స్వామిని భక్తితో కొలిచారు. అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, బాలభాస్కర శర్మ, సుబ్రహ్మణ్యం భక్తుల పేరిట అర్చనలు, అభిషేకలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

లలితాపీఠంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కిర్లంపూడిలోని లలితా పీఠంలో అమ్మవారు

ఏయూ క్యాంపస్ : బీచ్ రోడ్డులోని కిర్లంపూడి లే అవుట్‌లో ఉన్న శ్రీలలిత పీఠంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు. అక్టోబర్ 10 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్యం చండీహోమం, నిత్యార్చనలు, శ్రీచక్ర పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ముందుగా ఆలయంలో వివరాలు నమోదు చేసుకుని పూజల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరుపుతామని తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.



ఊయల ఊగుతున్న మహిళా కూలీలు



తూగుడు బల్ల ఆడుతున్న కూలీలు

అలసిన వేళ.. ఆటవిడుపుగా..

ఆటపాటలకు.. సంతోషించేందుకు వయసు అడ్డు కాదు. మనసు మురిసిన వేళ నడి వయసు వారు కూడా పిల్లలైపోతారు. నచ్చిన నేస్తాలతో సంతోషం పంచుకుంటారు. పాతనగరంలో పని పాటలు చేసుకునే రోజువారీ ఆడ, మగ కూలీలు భోజన విరామ సమయంలో దగ్గరలోని పార్కులో ఇలా ఉయ్యాల ఊగుతూ, తూగుడు బల్ల ఆడుతూ అప్పటి వరకు పడ్డ శ్రమను మరిచిపోయారు. – జగదాంబ

అనాథ పిల్లలకు భోజనాల అందజేత



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో అనాథ పిల్లలకు మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదివారం భోజనాలు ఏర్పాటు చేశారు. ఆశ్రమాన్ని మధ్యాహ్నం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అక్కడి పిల్లలకు భోజనాలు వడ్డించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో నడుచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆశ్రమం స్వామీజీ ఆచార్య సామ్యానంద్ అవధూత మాజీ మేయర్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.